సాక్షి
తిరుపతి
మంగళవారం । 4 । మార్చి । 2025



తిరుమలలో చిన్నారి అపహరణ
తిరుమలలో చిన్నారి దీక్షితను ఓ వృద్ధురాలు అపహరించింది. ఈ మేరకు చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. - 8లో



అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం
గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్వో నరసింహులు సిబ్బందిని ఆదేశించారు. - 8లో



'మెగా' నిర్లక్ష్యంపై కార్మికుల కన్నెర్ర
మెగా కంపెనీ నిర్లక్ష్యంపై కార్మికులు కన్నెర్ర చేశారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా వేధించడంపై కదం తొక్కారు. - 8లో




కష్టాలకు ఎదురొడ్డి..భూమాతనే నమ్ముకున్న అన్నదాతపై కూటమి నేతలు పగబట్టారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకుండా చేశారు. గోదాముల్లో నిల్వ చేసుకుందామంటే అద్దెలు పెంచేసి నడ్డివిరుస్తున్నారు. అన్నదాత సుఖీభవ, సబ్సిడీ ఎరువులు, పురుగు మందులు ఇవ్వక పోగా.. ఇలా అన్ని విధాలా నష్టాల్లో ముంచేయడం బాధాకరమని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు.

కూటమి పగ.. రైతులు దగా!



వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ గోదాముల్లో ధాన్యం నిల్వ చేయడానికి ట్రాక్టర్లతో వచ్చిన రైతులు



ధాన్యానికి ధరల్లేవు
- ప్రభుత్వ సాయమూ లేదు
- గోదాముల్లో నిల్వ ఉంచుకోవాలన్నా అద్దె చెల్లించాల్సిందే
- అష్టకష్టాలు పడుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు, నేతలు



సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ

సూళ్లూరుపేట: జిల్లాలో రబీ సీజన్ ముగింపు దశకు చేరింది. వరి ఒబ్బిళ్లు జోరందకున్నాయి. కానీ ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో కళ్లాల్లోనే రైతులు తెగనమ్మేస్తున్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేవరకు ఏఎంసీ గోదాముల్లో నిల్వ చేసుకుందామంటే బస్తాకు రూ.3 చొప్పున అద్దె చెల్లించాలని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో చేసేది లేక రైతులు ఒకటికి సగానికి విక్రయిస్తున్నారు.

గతంలో రుణాలు..ఇప్పుడు ఒట్టి చేతులు

గతంలో ఏఎంసీ గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకుంటే రుణాలిచ్చేవారు. ఒక లాట్‌కి 150 బస్తాలు ధాన్యాన్ని నిల్వ చేసుకుంటే ధాన్యం మద్దతు ధర్‌పై 75 శాతం రుణం కింద ఇచ్చేవారు. దీనికి మూడు నెలలు దాకా బాడుగ కట్టనవసరం లేదు. ఆ తరువాత నెలకు బస్తాకి ఒక్క రూపాయి లెక్కన అద్దె చెల్లించాల్సి ఉండేది. తీసుకున్న రుణానికి కూడా చాలా తక్కువ వడ్డీ ఉండేది. కానీ ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. బస్తాకు రూ.3 లెక్కన అద్దె చెల్లించాల్సి వస్తోంది.

నిల్వ చేసేదెక్కడ?
తిరుపతి జిల్లా పరిధిలోని 34 మండలాలకుగాను 774 పంచాయతీల్లో 16 మార్కెటింగ్ కమిటీలున్నాయి. వీటి పరిధిలో 34,300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు 37 గోదాములున్నాయి. అయితే ఈ ఏడాది జిల్లాలో 2.07 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఎకరానికి సరాసరిన 30 బస్తాల దిగుబడి వచ్చినా 5 లక్షల టన్నుల ధాన్యం వస్తుంది. ఇందులో ఇప్పటిదాకా 60 శాతం ధాన్యాన్ని నిల్వ చేసుకున్నారు. మిగిలిన 40 శాతం ధాన్యాన్ని విక్రయించారు. ఈ నెలాఖరు దాకా కోతకు వచ్చే పంటలు కూడా ఉండడంతో మరికొంతమంది నిల్వ చేసుకునే అవకాశం ఉంది.

అన్నీ కష్టాలే
గతంలో ఏఎంసీ గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచుకుంటే రుణాలు ఇచ్చేవారు. ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించేవారు. సబ్సిడీ ఎరువులు, పురుగు మందులు, పరికరాలు అందజేసేవారు. కానీ ఇప్పుడు ఇవేవీ లేకుండా చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను నామమాత్రంగా ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. మిల్లర్లను రైతులపైకి వదిలి చోద్యం చూస్తున్నారు.

గతంలో రుణాలిచ్చేవారు



"వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములో ధ్యానం నిల్వ చేసుకుంటే గతంలో 75 శాతం రుణం ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ రైతుల బతుకు మాత్రం మారడం లేదు. చాలా బాధాకరం.
– వాకాటి బాబురెడ్డి, గోపాల్‌రెడ్డిపాళెం

రుణాలిచ్చే పరిస్థితి లేదు
ప్రస్తుతం ఏఎంసీ గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకునే రైతులకు రుణాలివ్వలేని పరిస్థితి ఉంది. రైతులే బస్తాకు మూడు రూపాయలు అద్దె చెల్లించి నిల్వ చేసుకోవాలి. గతంలో ఒక రైతుకు ఒక లాట్ మాత్రమే కేటాయించేవారం. ఇప్పుడు పట్టాదారు పాసుపుస్తకాలను బట్టి ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాము.
– వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి, సూళ్లూరుపేట

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 110 అర్జీలు



ఎస్పీకి ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 110 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

పుస్తకోత్సవం ప్రారంభం



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న వీసీ

తిరుపతి సిటీ: ఎస్వీయూ కేంద్రీయ గ్రంథాలయం ఆధ్వర్యంలో పుస్తకోత్సవం పేరుతో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. సోమవారం వర్సిటీ వీసీ అప్పారావు పుస్తక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. పుస్తకం ఒక నేస్తం అని, ప్రస్తుతం పుస్తక పఠనం గణనీయంగా పడిపోవడం బాధాకరమైన అంశమన్నారు. కేంద్రీయ గ్రంథాలయాధిపతి ఆచార్య సురేష్‌బాబు మాట్లాడుతూ దేశవిదేశాలలో లభించే గ్రంథాలను ప్రదర్శనశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. డీన్ ఆచార్య ఎస్సీ రాయుడు, అధ్యాపకులు డాక్టర్ రంగనాథ్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై రాయితీ

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై గృహ వినియోగదారులకు 50 శాతం డిస్కౌంట్ ప్రభుత్వం ప్రకటించిందని ట్రాన్స్‌కో తిరుపతి, చిత్తూరు ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. తిరుపతి జిల్లాలో 7.95 లక్షల మంది, చిత్తూరు జిల్లాలో దాదాపు 4.37 లక్షల మంది కలిపి మొత్తం 12.32 లక్షల మంది సర్వీసులను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. సాధారణ రోజుల్లో కిలో వాట్‌కు రూ.2 వేలు క్రమబద్ధీకరణ రుసుం చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం రూ.1000 చెల్లిస్తే చాలన్నారు. జూన్ 30 వరకు ఈ అవకాశం ఉంటుందని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటిని ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా సంబంధిత విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రంలో చెల్లించవచ్చన్నారు.

ఆగమోక్తం.. ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన వధూవరులైన శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల ఉత్సవమూర్తులను వసంతోత్సవ మండపంలో కొలువుదీర్చి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం సూర్యపుష్కరణి వద్దకు త్రిశూలానికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు.

నేడు పల్లకీ సేవ
బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించనున్నారు.



ధ్వజావరోహణ కార్యక్రమంలో అర్చకులు



త్రిశూలానికి స్నానం చేయిస్తున్న అర్చకులు



ధ్వజావరోహణం సందర్భంగా విశేష పూజలు

పారదర్శకంగా పది పరీక్షలు



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి అర్బన్: పదో తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని కడప ఆర్జేడీ శామ్యూల్ తెలిపారు. సోమవారం తిరుపతిలోని కచ్చేపి స్టేడియంలో పది పరీక్షలపై ఆయన అధికారులతో సమీక్షించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ప్రత్యేక నిఘా ఉండాలని ఆదేశించారు. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న తరుణంలో ముందస్తు ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో 164 పరీక్షాకేంద్రాల్లో రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 28,656 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. మార్చి 5, 6 తేదీల్లో సెట్–1, సెట్–2 ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరుకుంటాయన్నారు. హాల్ టిక్కెట్లు మంగళవారం నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్‌పెట్టాలన్నారు. డీఈఓ కేవీఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ప్రారంభం



పాగాలి సమీపంలోని రాక్‌మ్యాన్ కంపెనీలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం



కంపెనీలో ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన జేసీ శుభం బన్సల్

రేణిగుంట: ఏర్పేడు మండలం, పాగాలి సమీపంలోని రాక్‌మ్యాన్ పరిశ్రమ ప్రాంగణంలో సోమవారం హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉండవల్లి నివాసం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ చేపట్టిన ఈ ప్రాజెక్ట్.. పారిశ్రామిక అవసరాల కోసం పీఎన్జీ, ఎల్పీజీతో గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్‌కు సరికొత్త విధానాన్ని అనుసరిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు.

లక్ష్యానికి తొలి అడుగు
స్వర్ణాంధ్ర విజన్–2047 సాధనలో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీని ప్రపంచ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి ఇది తొలిఅడుగు అవుతుందని సీఎం తెలిపారు. రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, క్లీన్ ఎనర్జీలో రూ.10 ట్రిలియన్ పెట్టుబడిని సాధిస్తామనే విశ్వాసం ఉందన్నారు. రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ద్వారా రెండు వేల మందికి ఉపాధి కలిగించడంతోపాటు ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుందన్నారు. జేసీ శుభం బన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ఎండీ, చైర్మన్ రాహుల్ ముంజల్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ గ్లోబల్ సీఈవో శ్రీవాత్సన్ అయ్యర్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ ఎండీ ఉజ్వల్ ముంజల్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ సీఈవో కౌసిక్ మన్నా, ఓహ్మియం సీఈవో ఆర్నే బాలంటైన్ పాల్గొన్నారు.

రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ.. మేనిఫెస్టోపై లేదా?



సత్యవేడు సబ్‌జైలు సమీపంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్‌కే.రోజా

సత్యవేడు: రెడ్‌బుక్‌పై పెట్టిన శ్రద్ధ ఎల్లో మేనిఫెస్టోపై ఎందుకు పెట్టడం లేదని మాజీ మంత్రి ఆర్‌కే రోజా ప్రశ్నించారు. సోమవారం సత్యవేడు సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న నగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆమె పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ ఎప్పుడో ఐదేళ్లకు ముందు మాట్లాడారని, ఇప్పుడు మనోభావాలు దెబ్బతినాయని 311 కేసు పెట్టి ఆరోగ్యం సరిలేని పోసాని మురళీకృష్ణని అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రెస్‌మీట్‌లో మట్లాడితే దేశద్రోహం అవుతుందా.. అన్ని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ గురించి చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణ ఎలా మాట్లాడారో అందరూ విన్నారని చెప్పారు. బీజేపీ నాయకులు, ప్రధాని మోదీ వీళ్లపై కేసు పెడితే వీళ్లు బయటికి వస్తారా..? అన్ని ప్రశ్నించారు. నగిరిలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత యువకులపై దాడిచేసి, వారి బైకులను తగలబెట్టి మళ్లీ వారిపైనే కేసు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడి సీఐ, డీఎస్పీ వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసి కేసులు పెట్టి వారిని రిమాండ్‌కు పంపడం దారుణమన్నారు. ఎవరూ ఎదురు మాట్లాడకూడదని చంద్రబాబునాయుడు అసెంబ్లీలో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా దొంగదారిన పబ్లిక్ అకౌంట్ చైర్మన్ ఇవ్వడం సిగ్గు చేటన్నారు. బయట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళు గట్టిగా మాట్లాడితే తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు చేస్తున్నారన్నారు. ఇదేగనుక జగన్‌మోహన్‌రెడ్డి చేసి ఉంటే ఒక్క టీడీపీ కార్యకర్త, జనసేక కార్యకర్త రాష్ట్రంలో బతకగలిగే వారా..? అని ప్రశ్నించారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ.నిరంజన్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బొప్పన సోమశేఖర్, సర్పంచ్ రమేష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మస్తాణి వైఎస్సార్‌సీపీ టీయూసీ చైర్మన్ గోవింద స్వామి, శ్రీనివాసులురెడ్డి, పళణి, రాబర్ట్స్, సురేష్, నగరి నాయకులు రామ్‌ప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆర్ కన్నెప్ప, కౌన్సిలర్ బీడీ భాస్కర్, మాజీ ఎంపీటీసీ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఆల్ట్రా డీలక్స్ వద్దు బాబోయ్

విశాఖపట్నానికి శ్రీకాళహస్తి మెట్రో సర్వీసులు
- వాటి స్థానంలో ఆల్ట్రాడీలక్స్ సర్వీసులు
- వీటిల్లో టిక్కెట్ ధర రూ.70
- లబోదిబో మంటున్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్: ఆల్ట్రాడీలక్స్ వద్దు.. మెట్రో సర్వీసులే ముద్దు అని ప్రయాణికులు చెబుతున్నారు. పదేళ్ల క్రితం శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోకు 22 మెట్రో సర్వీసులను ఏర్పాటు చేశారు. అయితే ఆర్టీసీ పెద్దలు వీటిని దశల వారీగా విశాఖపట్నానికి తరలించేస్తున్నారు. అక్కడ వాటిని టౌన్ సర్వీసులుగా తిప్పేందుకు అనుకూలంగా ఉంటాయని భావిస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆరు మెట్రో సర్వీసులను విశాఖపట్నానికి పంపించేశారు. మిగిలిన వాటిని రెండు, మూడు దశల్లో తరలించేందుకు సిద్ధమయ్యారు.

మెట్రో స్థానంలో ఆల్ట్రాడీలక్స్ సర్వీసులు

మెట్రో స్థానంలో తిరుపతి డిపోలోని ఆల్ట్రా డీలక్స్‌లను శ్రీకాళహస్తి డిపోకు తరలిస్తున్నారు. ఇప్పటికే ఆరు సర్వీసులు తరలించారు. సాధారణంగా మెట్రో సర్వీసుల్లో టిక్కెట్ ధర రూ.55 ఉండగా.. అదే ఆల్ట్రాడీలక్స్‌లో రూ.70 వరకు వసూలు చేస్తున్నారు. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్లి రావడానికి రానుపోను రూ.140 వరకు వెచ్చించాల్సి వస్తోంది. అంటే ఒకసారి తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి పోయి రావాలంటే రూ.30 వరకు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది.



తిరుపతి బస్టాండ్‌లోని శ్రీకాళహస్తి పాయింట్‌లో ఆగి ఉన్న ఆల్ట్రాడీలక్స్ సర్వీస్

మెట్రో సర్వీసులే మేలు



"తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్లడానికి మెట్రో సర్వీసులు ఎంతో సౌకర్యంగా ఉండేవి. వాటినే కొనసాగించాలని కోరుతున్నాం. ఆల్ట్రాడీలక్స్‌ల్లో డ్రైవర్లే టిక్కెట్లు కొడుతున్నారు. ఆయన దృష్టి డ్రైవింగ్‌పైనే కాకుండా టిక్కెట్లపై ఉంటోంది. ఇది చాలా ప్రమాదకరం.
– రెడ్డెప్ప, ప్రయాణికుడు

భారం తగ్గించాలి



మెట్రో సర్వీసులను తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి రద్దు చేసి... ఆ స్థానంలో ఆల్ట్రాడీలక్స్ సర్వీసులను ఏర్పాటు చేయడం ద్వారా రానుపోను రూ.30 అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. ప్రయాణికులపై భారం తగ్గించాల్సి ఉంది.
– వినోద్‌రెడ్డి, ప్రయాణికుడు

సౌకర్యవంతంగా ఆల్ట్రాడీలక్స్‌లు



తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో ఆల్ట్రాడీలక్స్ సర్వీసులు ఎంతో సౌకర్యంగా ఉన్నాయని భావిస్తున్నాం. అందుకే ఆరు మెట్రో సర్వీసులను విశాఖపట్నానికి పంపించాం. ఆ స్థానంలో ఆల్ట్రా డీలక్స్‌లను ఏర్పాటు చేశాం. మెట్రోతో పోల్చుకుంటే టిక్కెట్ ధర్‌పై రూ.15 మాత్రమే అదనం.
– నరసింహులు, జిల్లా ప్రజారవాణా అధికారి

నేడు వర్సిటీలు, డిగ్రీ కళాశాలలు బంద్

తిరుపతి సిటీ: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఏపీ పీజీ సెట్ కామన్ ఎంట్రన్స్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం తిరుపతి జిల్లా విద్యార్థి సంఘాల ఐక్య వేదిక బంద్‌కు పిలుపునిచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలను మూసివేసి నిరసన తెలపనున్నట్టు పేర్కొంది.

వేదాల అధ్యయనంతో మానసిక ప్రశాంతత



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ గణపతిభట్

తిరుపతి సిటీ: వేదాంత శాస్త్రాల అధ్యయనంతో ప్రశాంతత, జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను సులభంగా అధిగమించవచ్చని శ్రీపరమాచార్య శాస్త్ర పరిరక్షణ కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ గణపతి భట్ అభిప్రాయపడ్డారు. సోమవారం జాతీయ సంస్కృత వర్సిటీ ఇండోర్ ఆడిటోరియంలో జరుగుతున్న అంతర్జాతీయ శక్తి విశిష్టాద్వైతం సదస్సు రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.సంస్కృత భాషలోని ఔన్నత్యాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, ద్వైతవేదాంత విభాగాధ్యక్షులు నారాయణ, అధ్యాపకులు నాగరాజభట్, శివరామదాయగుడే, మనోజ్‌షిండే పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 572 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్–2 పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌లో 28,322 మంది, ఒకేషనల్‌లో 1,033 మంది మొత్తం 29,335 మంది విహాజరవ్వాల్సి ఉంది. అయితే వీరిలో 572 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఇంగ్లిష్ పేపర్–1 ఉంటుందన్నారు.

పకడ్బందీగా నేర నియంత్రణ

తిరుపతి క్రైమ్: జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి నేర నియంత్రణ కట్టడి చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరిలో సాధించిన పురగతిని ఆయన వెల్లడించారు. రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న 1,484 మంది అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్టు పేర్కొన్నారు. అలాగే 94.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే 2,222 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

క్లుప్తంగా

తిరుమలలో చిన్నారి అపహరణ


అపహరణకు గురైన చిన్నారి దీక్షిత

తిరుమల : తిరుమలలో చిన్నారిని గుర్తు తెలియని వృద్ధురాలు తీసుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి వెలుగు చూసింది. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన నర్సింహులు అనే వ్యక్తి తిరుమలలో హ్యాకర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను తన కుమార్తె దీక్షిత(4) షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు తీసుకొచ్చి ఉంచుకుని తను వ్యాపారం చూసుకుంటూ ఉండిపోయాడు. ఇంతలో పాప ఆడుకుంటూ సాయంత్రం 5 గంటలకు భక్తురాలైన ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లింది. సదరు వృద్ధురాలు పాపను తీసుకుని వెళ్లిపోయింది. దీనిపై తండ్రి తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా వృద్ధురాలు పాపను తీసుకుని ఆర్టీసీ బస్సులో తిరుపతికి వెళ్లిపోయినట్లు గుర్తించారు. వెంటనే ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేసి పాపకోసం గాలింపు చేపట్టారు. ఎవరైనా గుర్తిస్తే తిరుమల టూటౌన్ పీఎస్ నెం. 9440796769, 9440796772కు సమాచారం అందించాలని కోరారు.

- నిర్మాణాల్లో అడుగడుగునా అవినీతి
- పూర్తిగా కొరవడిన పర్యవేక్షణ
- పర్సంటేజీల మత్తులో ఇంజినీరింగ్ అధికారులు
- వేసిన రోడ్లపైనే మళ్లీ సీసీ రోడ్లు

సీసీ రోడ్లు.. పచ్చనోట్లు!



సాక్షి టాస్క్‌ఫోర్స్: రహదారుల నిర్మాణ పనులు కూటమి నేతలకు కాసుల పంట పండిస్తున్నాయి. అధికార మదంతో ఏ విధంగానైనా బిల్లులు చేసుకోవచ్చని ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తూ జేబులు నింపుకుంటున్నారు. పర్సెంటేజీలకు అలవాటు పడిన ఇంజినీరింగ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. డక్కిలి మండలంలో సీసీ రోడ్ల నిర్మాణాలు అడ్డదిడ్డంగా సాగుతున్నాయి. ఇందుకు సాక్ష్యంగా ఇప్పటికే పలు గ్రామాల్లో సీసీ రోడ్లు పగుళ్లుబారడం గమనార్హం.

సాక్షి టాస్క్‌ఫోర్స్

మండలంలోని సీసీ రోడ్ల వివరాలు

పంచాయతీలు	27
గ్రామాలు	58
మంజూరైన పనులు	59
నిధులు	రూ.2.8 కోట్లు
ఇప్పటి వరకు పూర్తయిన పనులు	49
చేపట్టాల్సిన పనులు	10
ఇష్టానుసారంగా చేసిన పనులు	2
రోడ్లపైనే రోడ్డు వేసిన సంఖ్య	2
అనుమతి లేకుండా వేసిన రోడ్లు	2
బిల్లులు చెల్లింపులు	రూ.26 లక్షలు
చెల్లించాల్సిన బిల్లులు	రూ.75 లక్షలు
పనులు దక్కించుకున్న కూటమి నేతల సంఖ్య	30


సీసీ రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తున్న నాసిరకం ఇసుక ఇదే

ఇదిగో సాక్ష్యం


డక్కిలి పంచాయతీ కార్యాలయం వీధిలో ఉన్న పాత సీసీ రోడ్డు (ఫైల్)

డక్కిలిలో అనుమతి తీసుకున్న ప్రాంతంలో కాకుండా వేరొక చోట సీసీ రోడ్డును నిర్మించారు. ఇదే గ్రామంలో ఓ టీడీపీ నేత ఇంటికి సిమెంట్ రోడ్డుపై మళ్లీ సిమెంట్ రోడ్డును నిర్మించారు. పంచాయతీ భవనం పక్క వీధిలో పాత సీసీ రోడ్డుపైనే మళ్లీ రోడ్డు నిర్మాణం చేపట్టారు.


డక్కిలిలో పంచాయతీ కార్యాలయం వీధిలో పాత రోడ్డుపై కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు ఇదే


డక్కిలి ప్రాథమిక పాఠశాల పక్క వీధిలో పాత సీసీ రోడ్డు (ఫైల్)


డక్కిలి ప్రాథమిక పాఠశాల పక్క వీధిలో పాత సీసీ రోడ్డుపై కొత్తగా వేసిన రోడ్డు


చాపలపల్లిలో పాత సీసీ రోడ్డుపై కొత్తగా రోడ్డు వేసేందుకు సిద్ధమవుతున్న దృశ్యం

చాపలపల్లి గ్రామంలో సీసీ రోడ్డు ఉన్న వీధిలోనే మళ్లీ రోడ్డును నిర్మించేందుకు అనుమతి తీసుకున్నారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ పని ప్రారంభించ లేదు.

మాటుముడుగు గ్రామంలో సిమెంట్ రోడ్లు ఇష్టారాజ్యంగా నిర్మించారు. అవసరమైన చోట కాకుండా ఎక్కడ పడితే అక్కడ రోడ్లు నిర్మించారు. నిర్మాణం సాగించిన కొద్ది రోజులుకే ఈ గ్రామంలో సీసీ రోడ్లు పగుళ్ల బారాయి. కాంట్రాక్టర్ మసిపూసి మారేడుకాయ చేసే చందంగా పగుళ్లపై సిమెంట్ పాలను రుద్దాడు.


మాటుముడుగులో నాణ్యత ప్రమాణాలు లోపించిన సీసీ రోడ్లు

నాణ్యత లోపం

డక్కిలి మండలంలో రూ.2.2 కోట్ల వరకు మంజూరు కాగా దాదాపు నిర్మాణాలు 90 శాతం పూర్తయ్యాయి. ఈ సిమెంట్ రోడ్ల నిర్మాణాల్లో కూటమికి చెందిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. సిమెంట్, ఇసుక, కంకర సమపాళ్లలో వేయలేదన్న విమర్శలున్నాయి. వాస్తవానికి నాణ్యత కలిగిన ఇసుకను వినియోగించాలి. అయితే స్థానికంగా వాగులు, వంకల్లో లభించే ఇసుకను వినియోగించారు. సీసీ రోడ్డు నిర్మాణాల్లో సిమెంట్, ఇసుక, కంకర 1:2:4 నిష్పత్తిలో వినియోగించాలి. అయితే ఇందుకు భిన్నంగా సీసీ రోడ్ల నిర్మాణాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి.

అవినీతి బట్టబయలు

డక్కిలి మండలంలో సీసీ రోడ్డు నిర్మాణాల్లో జరిగిన అవినీతి మొత్తం క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ అనంతరం బట్టబయలు అవుతోందని పలు గ్రామాల్లో చర్చ సాగుతోంది. వాస్తవానికి క్వాలిటీ కంట్రోల్ తనిఖీ అనంతరమే 30 శాతం బిల్లు కాంట్రాక్టర్‌కు వస్తుంది. ఈలోగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీకి రాక ముందే 70 శాతం బిల్లులు పొందేందుకు కాంట్రాక్టర్లు తహతహలాడుతున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సొత్తు, ముద్దాయిలతో పోలీసులు

నారాయణవనం: మండలంలో రెండు వేర్వేరు దొంగతనాల కేసుల్లో నారాయణవనానికి చెందిన గోపి(26)ని అరెస్ట్ చేసి 44 గ్రాముల బంగారం, 120 గ్రాముల వెండితో పాటు రూ.80 వేలు రికవరీ చేసినట్లు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు పుత్తూరు డీఎస్పీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ముద్దాయిని, రికవీ సొత్తును, నగదును ప్రదర్శించారు. రవికుమార్ మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీలో తాళం వేసిన నవీన్ ప్రకాష్ ఇంట్లో ఫిబ్రవరి ఒకటవ తేదీన, నారాయణవనం తేరువీధిలో తాళం వేసిన అమావాతి ఇంట్లో ఫిబ్రవరి 17వ తేదీన దొంతనాలు జరిగినట్లు తెలిపారు. రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. పక్కా సమాచారం రావడంతో సోమవారం మధ్యాహ్నం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద దామును అదుపులో తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. స్వల్ప వ్యవధిలో కేసును ఛేదించిన సీఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ జయరాం నాయక్, క్రైమ్ సిబ్బంది దాము, మోహన్, హెచ్‌సీ రాజేష్, కానిస్టేబుళ్లు భాస్కర్, శ్రీనాథ్‌ను ఈ సందర్భంగా డీఎస్పీ రవికుమార్ అభినందించి, రివార్డులను అందజేశారు.

ఎస్వీయూ డీడీఈ డైరెక్టర్‌గా రమేష్‌బాబు


నియామక పత్రం అందుకుంటున్న ప్రొఫెసర్ రమేష్‌బాబు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్య విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఆచార్య ఊకా రమేష్ బాబు నియమితులయ్యారు. ఆయన సోమవారం వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు నుంచి నియామక పత్రం అందుకున్నారు. రమేష్ బాబు మాట్లాడుతూ దూరవిద్య పరీక్షలను త్వరగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. అదేవిధంగా 2024–25కు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ వచ్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. డీడీఈ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనను అధ్యాపకులు పీసీ వెంకటేశ్వర్లు, ఎస్‌సీ రాయుడు, కిశోర్, ప్రయాగ, కోఆర్డినేటర్ హరికృష్ణ యాదవ్ అభినందించారు.

సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



అటానమస్ హోదాపై మాట్లాడుతున్న సిద్ధార్థ విద్యాసంస్థల సెక్రటరీ ఆనందరెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలలకు యూజీసీ అటానమస్ హోదా (స్వయంప్రతిపత్తి) లభించిందని సిద్ధార్థ ఎడ్యుకేషనల్ అకాడమీ సెక్రటరీ వై.ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1985లో రాయలసీమ ప్రాంతంలో పేద విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించాలనే ఉద్దేశంతో వై.కొండారెడ్డి, యం.వెంకట్రామిరెడ్డి రాయలసీమ విద్యాసంస్థలను ప్రారంభించినట్లు వివరించారు. గత 40 ఏళ్లుగా విద్యాసంస్థల్లో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కాకుండా కొత్త రకం కోర్సులను తెచ్చి విద్యార్థులను ఉన్నత స్థాయిలో స్థిరపడేలా చేయడం జరిగిందన్నారు. పేద విద్యార్థులకు టెక్నికల్ విద్యను కూడా చేరువ చేయాలన్న ఉద్దేశంతో 2009లో సిద్ధార్థ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలలను స్థాపించినట్లు తెలిపారు. విద్యార్థులకు అన్నిరకాలు శిక్షణ అందించి మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశం సంపాధించుకునేలా చేయడం జరిగిందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో న్యాక్ గుర్తింపు పొంది స్వయంప్రతిపత్తి హోదాను సాధించినట్లు వివరించారు. కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, వైస్ చైర్మన్ విజయ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

'మెగా' నిర్లక్ష్యంపై కార్మికుల కన్నెర్ర

- రెండు నెలలుగా అందని వేతనాలు
- మెగా సంస్థ కార్యాలయ గేట్లు మూసి నిరసనకు దిగిన కార్మికులు

శ్రీకాళహస్తి : మదనపల్లె–నాయుడుపేట ఆరు లేన్ల జాతీయ రహదారి విస్తరణ పేరిట పనులు చేపట్టిన మెగా సంస్థ అడగడుగునా కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది. కార్మికుల భద్రతను గాలికొదిలేసిన ఆ సంస్థ వేతనాల విషయంలోనూ ఎగవేత ధోరణిని అవలంబిస్తోంది. మెగా సంస్థకు మ్యాన్ పవర్‌ను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌కు గత రెండు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు. దీంతో కార్మికులు సోమవారం శ్రీకాళహస్తి సమీపంలో ఉన్న మెగా బేస్ క్యాంపు వద్ద గేట్లను మూసి నిరసన తెలియజేశారు. కనీసం సంక్రాంతికి కూడా తమకు వేతనాలు ఇవ్వకపోవడంతో పండుగను కుటుంబంతో కలిసి జరుపుకో లేకపోయామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు వెంటనే మంజూరయ్యేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేకుంటే మెగా పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్మికుల ఆందోళనతో దిగొచ్చిన మెగా జీఎం మల్లికార్జున మంగళవారం సాయంత్రం లోపు జీతాలు చెల్లించే ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

ఎంబీఏ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ


నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా బజాజ్ ఫైన్ సర్వీస్ సంస్థ స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాల ఎంబీఏ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై శిక్షణ ఇచ్చారు. కళాశాలలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముంబై వాల్‌చంద్ పీపుల్స్ ప్రాజెక్ట్ హెడ్ రష్మీ మన్నాని ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పారిశ్రామిక రంగంలో ఉద్యోగాల సాధనకు అవసరమైన నైపుణ్యం గురించి వివరించారు. ఉద్యోగాన్వేషణలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు అడిని సందేహాలను నివృత్తి చేశారు. పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీసీఈ ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, హెడ్ ప్రొఫెసర్ నీరజ, బజాజ్ ఫైన్ సర్వీస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 68,592 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,273 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.63 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

టీటీడీకి రెండు ఎలక్ట్రిక్ స్కూటర్ల వితరణ


వాహనాల తాళాలు అందజేస్తున్న దాతలు

తిరుమల: టీటీడీకి సోమవారం తిరుపతిలోని ఏఎంఆర్‌డీ బిల్డర్స్ ఎండీలు మారుతి నాయుడు, దేవేంద్ర నాయుడు రూ.2.28 లక్షల విలువైన రెండు బజాజ్ ఎలక్ట్రిక్ స్కూటర్లు వితరణ చేశారు. శ్రీవారి ఆలయం ఎదుట స్కూటర్లకు పూజలు చేసి డెప్యూటీ ఈవో లోకనాథంకు తాళాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుమల డీఐ సుబ్రమణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ /తిరుపతి అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని హెచ్‌ఎంలు, టీచర్ల సాధారణ సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని చిత్తూరు, తిరుపతి డీఈవోలు వరలక్ష్మి, కేవీఎస్ కుమార్ తెలిపారు. వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల కింద పనిచేస్తున్న టీచర్ల సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ జాబితాలను www.chittoordeo.com వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. వాటిపై అభ్యంతరాలు ఉంటే డీడీవో సంతకంతో ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటలలోపు చిత్తూరు డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. టీచర్ పూర్తి పేరు, కేడర్, సీనియారిటీ జాబితాలోని తప్పిదాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఆధారాలతోపాటు సంబంధిత డాక్యుమెంట్స్ జతచేయాలన్నారు. గడువు తర్వాత అందే అభ్యంతరాలను స్వీకరించబోమని వెల్లడించారు.

వాహన యజమానులూ జాగ్రత్త

- మైనర్లు వాహనాలు నడిపితే రూ.5 వేల జరిమానా

తిరుపతి క్రైం: వాహన యజమానులు ఇక జాగ్రత్త పడాల్సిందే. ఎందుకంటే రహదారి నిబంధ నలు కఠినంగా అమలు చేసేందుకు రవాణా, పోలీసు అధికారులు సిద్ధమయ్యారు. 'హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనా లు నడపడం వల్లే ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నా యి. నిబంధనలను సరిగ్గా అమలు చేయడం లేదు' అంటూ పోలీస్, రవాణాశాఖ అధికారులపై ఇటీవల హైకోర్టు ధర్మాసనం అక్షింతలు వేసింది. ఈ క్రమంలో నిబంధనలు పక్కాగా అమలు చేయాలని భావిస్తున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే భారీ జరిమానా

గతంలో మైనర్లు వాహనాలు వాడితే పెద్ద వారికి శిక్ష పడేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొత్త చట్టం ప్రకారం మైనర్లు వాహనం నడిపితే రూ.5 వేలు జరిమానా విధిస్తారు. అలాగే మూడేళ్ల జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది.

ఫైన్లు ఇలా..

- లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే గతంలో రూ.500 జరిమానా విధించే వారు. ఇప్పుడు దాన్ని రూ.5 వేలకు పెంచనున్నారు.
- హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే, వెనుక వైపు కూర్చున్నా కూడా రూ.1000 జరిమానా.
- రెడ్ లైట్స్ ఉల్లంఘించి వాహనాలను నడిపితే రూ.500
- అతివేగంగా వాహనాన్ని నడిపితే రూ.1000
- రాంగ్ రూట్‌లో వాహనాన్ని నడిపితే రూ.5000
- డ్రంక్ అండ్ డ్రైవ్ గతంలో రూ.2 వేలుగా ఉన్న ఫైన్ను ఇప్పుడు ఏకంగా రూ.10 వేలకు పెంచారు.
- రేసింగ్, స్పీడ్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కార్లు నడిపితే రూ. వెయ్యి కట్టాల్సిందే. దీనికి తోడు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు.
- అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళితే రూ.10 వేలు
- ద్విచక్ర వాహనాల్లో ట్రిబుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే రూ.1000. మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు.
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే రూ.2 వేలు.

నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తాం. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. మైనర్లు వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులకు జైలు శిక్ష తప్పదు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నూతన రూల్స్‌ను పాటించాలి.

– హర్షవర్ధన్‌రాజు, తిరుపతి జిల్లా ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిట్టమూరు: నాయుడుపేట–మల్లాం రహదారి మార్గంలోని చిట్టమూరు మండం, బయ్యవారికండ్రిగ గ్రామ మలుపు రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ చిన్నబలరామయ్య వివరాల మేరకు.. బురదగల్లి కొత్తపాళెం పంచాయతీ, కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన కన్నెబోయిన మారెయ్య(38) సోమవారం మోటార్ సైకిల్‌పై కొత్తగుంటకు వెళ్లి మన్నెమాలకు బయలు దేరాడు. బయ్యవారికండ్రిగ గ్రామ మలుపు వద్ద ట్రాక్టర్ బయ్యవారికండ్రిగ రోడ్డు వైపు తిరుగుతుండగా అదుపుతప్పి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మారెయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని నాయుడుపేట వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం


డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న అప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతి అర్బన్: అర్జీలను తీసుకోవడమే కాదు వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 280 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ సమస్యలపైనే 163 అర్జీలు ఉన్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో క్యూ పద్ధతిని ఏర్పాటు చేశారు. రైతు సాధికారతి సమితి నేతృత్వంలో తాజా కూరగాయలను కలెక్టరేట్ వద్ద విక్రయించడానికి ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతిచ్చారు.

మాటనిలబెట్టుకుంటే మంచి ప్రభుత్వమే

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే మంచి ప్రభుత్వమేనని ఏఐటీయూసీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి పేర్కొన్నారు. అప్కాస్‌ను కొనసాగించాలని కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. వారికి మద్దతుగా ఏఐటీయూసీ నేతలు విచ్చేశారు. కనీస వేతనం రూ.32వేలు చేయాలని తెలిపారు.

అప్కాస్ రద్దును విరమించుకోండి

అప్కాస్ రద్దును విరమించుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. ఆ మేరకు గ్రీవెన్స్ సందర్భంగా కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులకు వినతిపత్రాన్ని అందించారు.

మెస్ చార్జీలు పెంచండి

బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు యూ.నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. ఆ మేరకు డీఆర్వోకు వినతి పత్రాన్ని అందించారు.

రక్షణ కల్పించండి

బస్టాండ్ సమీపంలోని జయశ్యామ్ సినిమా హాల్ వద్ద ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వారిపై కొందరు దౌర్జన్యాలు చేస్తున్నారని ఆటోవాలాలు ధర్నా చేపట్టారు. వారికి మద్దతుగా సీఐటీయూ నేతలు నిలిచారు.